క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన అనంతరం బాలభోగం నివేదించారు. తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు కల్పించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాదం, మజ్జిగ వితరణ చేపట్టారు.

అభ్యుదయవాది శ్రీశ్రీ



శ్రీ శ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: మహాకవి శ్రీ శ్రీ వర్ధంతి కార్యక్రమాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం పరవాడలో ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రామిక, పీడిత వర్గాల కోసం శ్రీ శ్రీ అనేక రచనలు చేశారని కొనియాడారు. శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) స్వస్థలం విశాఖపట్నం కావడం ఈ ప్రాంత ప్రజలు గర్వించదగ్గ విషయమన్నారు. అల్లూరిసీతారామరాజు చిత్రంలో రచించిన తెలుగువీర లేవరా పాటకు తొలిసారి జాతీయ పురస్కారం లభించిందని గనిశెట్టి కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పైడి, లక్ష్మి, నీలిమ, అరుణ, రమణమ్మ, మధురిమ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా వల్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



పూజలందుకున్న సుబ్రహ్మణ్యస్వామి

పెందుర్తి: వెంకటాద్రి క్షేత్రంలో నిర్మించిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు జరిపారు. అనంతరం కల్యాణం అత్యంత వైభవంగా చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన క్రతువులో మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు దంపతులు, వెంకటాద్రి ఈవో నీలిమ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ



దెబ్బతిన్న కారు

పరవాడ: గాజువాక–పరవాడ రహదారిలో పోలీస్‌స్టేషన్ వద్ద మలుపులో శనివారం మధ్యాహ్నం లారీ ఢీ కొట్టడడంతో ఓ కారు ధ్వంసమైంది. వివరాలు.. గాజువాక నుంచి పరవాడ వైపు వస్తున్న కారును పరవాడ నుంచి దేశపాత్రునిపాలెం వైపు వెళుతున్న లారీ పరవాడ పోలీసు స్టేషన్ వద్ద మలుపులో బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. కారులో ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం!



ఎన్టీపీసీ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న తీగలు




ఊటగెడ్డ సమీపంలో హెచ్‌టీ విద్యుత్ స్తంభాన్ని అల్లుకున్న తీగలు



పరవాడ వెలుగు కార్యాలయం వద్ద స్తంభానికి..

పరవాడ: మండలంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలను తీగలు కప్పేశాయి. ఫలితంగా తరచూ విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డితో పాటు అల్లిక తీగలు విద్యుత్ స్తంభాల పైకి ఎగబాకి వైర్లను చుట్టుకున్నాయి. ఇలా అల్లుకున్న తీగలను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడడంతో పాటు మేత కోసం వెళ్లే పశువులు, పశువుల కాపర్లకు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- సింహాద్రి ఎన్టీపీసీ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తీగలు అల్లుకున్నాయి.
- పరవాడ వెలుగు కార్యాలయం వద్ద విద్యుత్ స్తంభంపైకి తీగలు ఎగబాకాయి.
- తానాం రహదారిలో విద్యుత్ తీగలకు చెట్టు కొమ్మలు తాకుతున్నాయి. – ఊటగెడ్డ కూడలికి సమీపంలో హెచ్‌టీ లైన్‌కు తీగలు అల్లుకున్నా అధికారులు కనీసం పట్టించుకొన్న పాపాన పోలేదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించిన విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలను తొలగించి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తానాం రహదారిలో విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్టు కొమ్మలు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శని**వారం ఆర్జిత సేవలు** విశేషంగా జరిగాయి. **ఉదయం 9.30 గంటల**కు ఆలయ కల్యాణ మం**డపంలోని వేదికపై స్వా**మివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఉభయాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

తాడి గ్రామాన్ని తరలించాలని వినతి

పరవాడ: కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించి ప్రజలను ఆదుకోవాలని మాజీ ఎంపీపీ మాధంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అనకాపల్లి డీఆర్వో దయానిధిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామాన్ని సురక్షి ప్రదేశానికి తరలించడమే కాకుండా అదనపు ల్యాండ్ ఫిల్‌ను నిలుపుదల చేయాలని, ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందజేయాలని వారు డిమాండ్ చేశారు. తాడి గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించే వరకు ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ జారీ చేసిన ఆదేశాల ప్రతిని డీఆర్వోకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, గవిరెడ్డి కనకరాజు, ఎం.సూరి అప్పారావు, జి.నూకరాజు, కోమటి కులదీప్‌రాజు, కె.అచ్చిబాబు, గుమ్మాలరాము, బి.నీలకంఠరావు, జి.సత్తిబాబు, జి.శ్రీనివాసరావు, కోమటి రామారావు ఉన్నారు.



డీఆర్వో దయానిధికి వినతిపత్రం అందజేస్తున్న తాడి గ్రామ ప్రజలు

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు

పరవాడ: మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో జిల్లా ఆర్చరీ సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు ముగిశాయి. జిల్లా ఆర్చరీ సంఘ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 24 వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారికి జిల్లా ఆర్చరీ సంఘ అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి, పాఠశాల సీఈవో కె.నిశాంత్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల వివరాలు ..

అండర్–10 విభాగంలో: ఎస్.వి.శరత్, పి.ఠాగూర్, బి.విరాజ్, ఎల్.సాత్విక్, ఎస్.శశికాంత్.

అండర్ –13 విభాగంలో : కె.నందిత, వి.ఆద్య, వి.కీర్తి, వి.లలితసాయి, ఎన్.తేజేశ్వర్‌రావు, కె.ఆశ్రిత్, ఎస్.తన్మయ్, వి.యశస్వి.

అండర్–15 విభాగంలో: బి.మణిత్, నభ్యప్రబాత్, ఎస్.రామచైతన్య, బి.వైష్ణవి, కె.సాయి మనస్వి, పి.హర్షిత, పి.హరియాణ.



ఆర్చరీ క్రీడాకారులతో ఆ సంఘ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి తదితరులు

బొగ్గుస్టేషన్ల పనితీరుపై సమీక్ష

పరవాడ: ఎన్టీపీసీ సింహాద్రిలో దక్షిణ ప్రాంత స్టేషన్ల త్రైమాసిక పనితీరుపై శుక్రవారం ఎన్టీపీసీ ఆపరేషన్ డైరెక్టర్ ఎస్.హెచ్.రవీంద్రకుమార్ సమీక్ష నిర్వహించారు. అనంతరం అన్ని ఎస్.ఆర్.బొగ్గు స్టేషన్ల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతపై దృష్టి కేంద్రీకరించడంతో పాక్షిక నష్టాలను తగ్గించడంపై అధికారులకు సూచనలు చేశారు. ప్రేమ్‌ప్రకాష్ ఆర్‌ఈడీ(సౌత్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఓఎస్) అరిందమ్ సిన్హా, ఈడీ విజయప్రకాష్(సేఫ్టీ ఓసీ), ఈడీ కేఆర్ పాండు(రామగుండం), సింహాద్రి సీజీఎం ఎస్.కె.సిన్హా, కుద్గి సీజీఎం బి.ఎస్.ఝా, ఏకే మనోహర్(ఎన్‌టీఈసీఎల్, వల్లూర్) పాల్గొన్నారు.



దక్షిణ ప్రాంత ఎన్టీపీసీ స్టేషన్ల అధికార బృందంతో డైరెక్టర్ రవీంద్రకుమార్

స్టీల్‌ప్లాంట్‌కు సత్వర సాయం అందించాలి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సత్వర సాయం అందించాలని యూనియన్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయీస్ (యూజ్) అధ్యక్షుడు బి.కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.పరంధామయ్య డిమాండ్ చేశారు. ఎల్ఎంఎం పార్కులో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం లేకుండా కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ఆదుకోవాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు సమయానికి జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉందని, దేశంలోని ఏ ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ ఈ పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఎస్.అమ్మన్న, కె.నీలకంఠేశ్వరరావు, ఆర్.చిన్నయ్య, ఎస్.శేషాచలం తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న పరంధామయ్య

అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన





కూచిపూడి నృత్యంతో అలరిస్తున్న చిన్నారులు, నృత్యంలో శిక్షణ పొందిన విద్యార్థినులు

సీతంపేట: విశాఖ సాహిత్య కళా సమితి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి నృత్యోత్సవాలు ప్రేక్షకులను అలరించాయి. శనివారం పలువురు చిన్నారులు వివిధ రీతుల్లో చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గాజువాకకు చెందిన విశాఖ సాహిత్య కళా సమితి ఆధ్వర్యంలో నాట్యగురువు టి.సందీప్ కుమార్ విద్యార్థినులకు కూచిపూడి నృత్యంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తయిన సందర్భంగా పౌర గ్రంథాలయంలో వేసవి నృత్యోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఎంత మేరకు డ్యాన్స్ నేర్చుకున్నారు తెలిసేలా ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు, కూచిపూడి కళాకారులకు నందీశ్వర, ఐరావత పురస్కారాలు ప్రదానం చేశారు.

1220వ రోజుకు ‘ఉక్కు’ దీక్షలు

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. 1220వ రోజు, శనివారం దీక్ష శిబిరంలో పోరాట కమిటీ నాయకుడు ఆదినారాయణ మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉద్యమం కొనసాగుతున్నా, పాలకుల్లో కనీసం స్పందన లేకపోవడం బాధాకరమన్నారు.

ఖరీఫ్‌పై చిగురించిన ఆశలు

- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు
- అపరాల్లో నువ్వు పంటకు ప్రాధాన్యం



ట్రాక్టర్ సాయంతో పొలంలో నువ్వు విత్తనాలు కలుపుతున్న రైతు



వర్షాలతో ఊపిరి పోసుకుంటున్న అపరాల సాగు

పెందుర్తి: అన్నదాతలు పూర్తిస్థాయిలో పొలం బాట పట్టారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు తొలకరి వ్యవసాయ పనులు మొదలయ్యాయి. తాజాగా పడుతున్న వర్షాలతో రైతులు ఆశాజనకంగా సేద్యాన్ని ప్రారంభించారు. రెండు మూడు రోజులుగా పొలాల్లో దుక్కు పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతోపాటు అపరాల పంటలు వేస్తున్నారు. నువ్వులు, పెసర్లు, పిల్లి పెసర, మినుములు ఇతర అపరాల పంటల కోసం విత్తనాలు చల్లుతున్నారు. వాతావరణం పూర్తిగా మారడంతో నియోజకవర్గంలోని సబ్బవరం, పెందుర్తి, పరవాడ ప్రాంతాల్లో రెండు రోజులుగా తీరిక లేకుండా వ్యవసాయ పనులు చేస్తున్నారు.

నువ్వుసాగుపైనే ఆసక్తి

నియోజకవర్గంలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 9 వేల ఎకరాల్లో పంటలు వేస్తారు. దానికి ముందు సాధారణంగా తొలకరి పంటలుగా నువ్వులు, గంటిచేను, పిల్లిపెసర, మినుములు ఈ ప్రాంతంలో విస్తారంగా వేస్తారు. అయితే ఈ ఏడాది అధిక శాతం మంది రైతులు నువ్వు చేను వైపు మొగ్గు చూపారు. ఇతర పంటలతో పోల్చితే పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు వర్షాభావ పరిస్థితులను తట్టుకుని నిలబడుతుంది. దీంతోపాటు పంట సజావుగా పండితే నువ్వులకు మంచి గిరాకీ ఉంది. దీంతో అన్నదాతలు దీనిపైనే ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం సబ్బవరం, పెందుర్తి, పరవాడ ప్రాంతాల్లో దాదాపు వెయ్యి ఎకరాల్లో నువ్వు విత్తనాలు చల్లారు. మరో 500 ఎకరాల్లో గంటి చేనుతో పాటు ఇతర అపరాల పంటలు వేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పరవాడ: గాజువాక–అనకాపల్లి జాతీయ రహదారిలో తాడి మూడు మదుంల వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన పురస్తాం సీతి (51) చెందాడు. సీఐ బాల సూర్యారావు అందించిన వివరాలు...పురస్తాం సీతి శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో తాడి మూడు మదుంల జంక్షన్ నుంచి రోడ్డు పక్కగా నడుచుకొని వెళ్తుండగా ఓ లారీ వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సీతిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృత దేహాన్ని మార్చురీలో భద్రపరిచి కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాల సూర్యారావు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్నారి మృతి

మద్రిపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ చిన్నారి మృతి చెందిన ఘటన ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. పూజిత(10) అనే చిన్నారి తల్లిదండ్రులతో కలిసి కంచరపాలెం పోస్టాఫీస్ దరి గంగానగర్‌లో నివసిస్తోంది. శుక్రవారం రాత్రి తన తండ్రి సురేష్‌కుమార్‌తో కలిసి తాటిచెట్లపాలెం 28 బస్‌స్టాప్ నుంచి తాటిచెట్లపాలెం జాతీయ రహదారి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో రహదారి వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో అటుగా అక్కయ్యపాలెం వైపు నుంచి ఎన్ఏడీ వైపు వెళ్తున్న లారీకి ద్విచక్ర వాహనం హ్యాండిల్ తగలడంతో తండ్రీకుమార్తెలు ఇద్దరు పడిపోయారు. దీంతో పూజిత తలకు తీవ్రమైన గాయమైంది. చిన్నారిని చికిత్స కోసం సెవెన్‌హిల్స్ ఆస్పత్రికి తరలించారు.

18 నుంచి రామాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు



కార్యక్రమంలో పాల్గొన్న రామాలయ కమిటీ సభ్యులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలోని కోదండ సీతారాముల ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ పరిషత్తు ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు హిందూ ధర్మ పరిషత్ మండల ధర్మాచార్య అనకాపల్లి వెంకటరమణ తెలిపారు. 18వ తేదీన రామాయణ ప్రవచనం, భజనలు , 19న మహాభారత ప్రవచనం, 20న భగవద్గీత పారాయణ, 21న కుంకుమ పూజలు, 22న సల్లా సత్యనారాయణ ప్రవచన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. గ్రామ పెద్దలు ఎం. మహాలక్ష్మి నాయుడు, సన్యాసినాయుడు, అప్పలనాయుడు, సూర్యనారాయణ, ఎల్. మహేష్ ,బి రాము ,గొంప అప్పలనాయుడు ,వి. సూర్యనారాయణతో పాటు రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ ఎర్రంనాయుడు

అగనంపూడి: బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునే వయసులో జీవితాలను అంధకారం చేసుకోవద్దని దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణతో మెలిగి, చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాల మార్గనిర్దేశం చేశారు. పోక్సో చట్టం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వాడకం, లైంగిక వేధింపులపై కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖ నగరంలో మాదక ద్రవ్యాలు వందరోజుల్లో నిర్మూలించడం, నివారణ కోసం పెద్ద ఎత్తున కార్యక్రమాలు రూపొందించినట్లు చెప్పారు. మాదకద్రవ్యాల రవాణాలో విద్యార్థులే పాల్గొంటున్నారని, వీటి వల్ల చిన్నతనంలోనే వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిపోతోందన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

విద్యార్థులకు పోక్సో చట్టంపై సీఐ అవగాహన కల్పించారు. మైనర్లను, మహిళలను మానసికంగా, శారీరకంగా వేధించడం, లైంగిక దాడులకు పాల్పడడం వంటి చర్యల వల్ల అనేకమంది జైలు పాలవుతున్నారన్నారు. న్యాయస్థానం వారికి విధించే శిక్షలను వివరించారు. మైనర్లు ప్రేమ పేరుతో సాగించే చర్యల వల్ల ఇద్దరి జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు.

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

పిల్లలతో ఎలా వ్యవహరించాలి, మెలగాలనే అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పిల్లల నడవడిక, ప్రవర్తన, ఆలోచనా ధోరణులను గమనించి వారు సరైన మార్గంలో నడిచేలా చూడాలన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.